PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :181 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం.21.07.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## పామాయిల్ ధర పెంపునకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది: భట్టి విక్రమార్క



ఖమ్మం జిల్లా, జులై 20 ప్రభాత సూర్యుడు పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు.

**ఖమ్మం జిల్లా రైతులు అన్నిరకాల పంటలు సాగు చేస్తారు..**

అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు.

**పామాయిల్ ధర పెరిగింది..**

1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.




- సభ సజావుగా జరిగేందుకు సహకరించండి
- విపక్షాలకు ప్రధాని మోదీ పిలుపు

# ప్రజా సమస్యల పరిష్కార వేదికే పార్లమెంట్

పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విపక్షాలకు కీలక విజ్ఞప్తి చేశారు. సభ సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. దేశానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై అర్థవంతమైన, ఫలవంతమైన చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంసద్ భవన్(పార్లమెంట్) ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, .. గత నెల రోజులుగా దేశంలో ఎన్నో పరిణామాలు జరిగాయి. వాటిపై సభలో చర్చలు జరగాలి. ప్రజా సమస్యలపై చర్చించేందుకు పార్లమెంట్ వేదిక కావాలి అని అన్నారు. ఈ సందర్భంలో తాజా స్కైరూట్ విక్రమ్ ప్రయోగంపై ప్రశంసలు గుప్పించారు. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థ స్కైరూట్ సాధించిన విజయాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతరిక్షంలో నవశకం మొదలైందని.. స్కైరూట్ సంస్థ విక్రమ్ రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపడం దేశానికే గర్వకారణమని అన్నారు. కేవలం 28 ఏళ్ల యువకులు ఈ ఘనత సాధించారు. ఇది భారత యువశక్తికి, కొత్త ఆలోచనలకు నిదర్శనం అని మోదీ పేర్కొన్నారు.

న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడు

**56 ఏళ్ల యువకుడ్ని కాదు!**

అయితే ఈ సందర్భంగా మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. స్కైరూట్ బృందం సక్సెస్‌ను ప్రస్తావిస్తూ.. ''నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు'' అంటూ వ్యాఖ్యానించారాయన. రాహుల్ గాంధీ వయసు 56 ఏళ్లు కావడంతో..మోదీ వ్యాఖ్యలు కాంగ్రెస్ నేతపై పరోక్ష సెటైర్‌గా భావిస్తున్నారు.

**సభ సజావుగా సాగాలి**

పార్లమెంట్ సమావేశాలు రాజకీయ విభేదాలకు మాత్రమే పరిమితం కాకుండా.. దేశ ప్రయోజనాల కోసం ఉపయోగపడాలని ప్రధాని ఆకాంక్షించారు. ఎంపీలందరూ సహకరించి నిర్మాణాత్మక చర్చలకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, వాదనలు సహజమని.. అయితే సభా సమయం వృథా కాకుండా ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధన సంక్షోభం ఏర్పడింది. అన్ని దేశాలు నష్టపోతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారాయన. చమురు ధరలు అమాంతం పెరుగుతున్నాయి. అయినా ఆ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాం అని అన్నారాయన. ఈ క్రమంలోనే హైడ్రోజన్‌తో నడిచే రైలును పరుగులు పెట్టించినట్లు మోదీ చెప్పారు.వర్షాకాల సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చకు అవకాశం ఉండటంతో.. అధికార, ప్రతిపక్ష సభ్యులు సమన్వయంతో వ్యవహరించాలని ప్రధాని కోరారు.




# గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం..

### రైతులకు మంత్రి తుమ్మల పిలుపు..



ఖమ్మం జిల్లా, ప్రభాత సూర్యుడుకొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు.ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల.

## రూ.10వేలు చెల్లించి ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, జులై 20 ప్రభాత సూర్యుడు క్యూర్ పరిధిలో ఫ్లాట్ల కోసం రేపటి నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ఫ్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**వారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తాం..**

క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. .

# రూ. 5 కోట్ల దొంతికుంట చెరువు 'అభివృద్ధి' హడావుడి: పారదర్శకత ఎక్కడ?

**అనుమతుల పత్రాలు ఏవీ? గ్రామసభ తీర్మానం ఉందా?**
**ఆయకట్టు రైతులను సంప్రదించకుండానే పనులా?**
**ఇది సక్రమమా.. అక్రమమా**







అశ్వారావుపేట, జూలై 21( ప్రభాత సూర్యుడు )అశ్వారావుపేట పట్టణ నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మక దొంతికుంట చెరువు చుట్టూ ఇప్పుడు అనుమానాల మేఘాలు కమ్ముకున్నాయి. రూ. 5 కోట్ల భారీ వ్యయంతో జరుగుతున్నట్లు చెబుతున్న ఈ అశ్వారావుపేట దొంతికుంట చెరువు అభివృద్ధి పనుల వెనుక అసలు కథ ఏంటి? ఇది ప్రజా ప్రయోజనం కోసమా, లేక అధికారుల, కాంట్రాక్టర్ల స్వార్థ ప్రయోజనాల కోసమా అని స్థానిక ప్రజలు, ఆయకట్టు రైతులు ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు. రాత్రికి రాత్రే సాగుతున్న ఈ హడావుడి పనులపై పారదర్శకత కరువైందని, నిబంధనలు తుంగలో తొక్కారని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

**గ్రామసభ తీర్మానం ఎక్కడ**

పల్లె ప్రగతికి, స్థానిక అభివృద్ధ సుప్రీం అని చట్టాలు చెబుతుంటే, ఈ రూ. 5 కోట్ల ప్రాజెక్టుపై గ్రామంలో( మున్సిపాలిటీ) ఎప్పుడైనా గ్రామసభ నిర్వహించి, ప్రజల ఆమోదం లేదా తీర్మానం తీసుకున్నారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఈ గుట్టుచప్పుడు కాని వ్యవహారం ఎందుకు నడుస్తోందని నిలదీస్తున్నారు. ఈ చెరువు కింద సాగు చేసుకునే ఆయకట్టు రైతుల ప్రయోజనాలను పణంగా పెడుతూ, ఆయకట్టు రైతులు సాగునీటి కాలువ లేక ఇబ్బంది పడుతూ ఉంటే వారిని సంప్రదించకుండానే ఈ పనులు ఎలా మొదలుపెట్టారనేది ఇప్పుడు మిస్టరీగా మారింది.

**అనుమతులు ఇచ్చిన శాఖ ఏది**

ఇంత భారీ మొత్తానికి సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అనుమతులు అసలు ఏ ప్రభుత్వ శాఖ నుండి వచ్చాయి? ఇరిగేషన్ శాఖా, పంచాయతీ రాజా, లేక పురపాలక శాఖా? ఆ పత్రాలను ప్రజల ముందు ఎందుకు ఉంచడం లేదు?

కేవలం ఉన్నతాధికారుల, కమిషనర్ల మెప్పు కోసమే ఈ హడావుడి పనులు చేస్తున్నారా? నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇంత వేగంగా పనులు లాగించేయడం వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రశ్నించే హక్కును రాజ్యాంగం ఇచ్చింది!**

అధికారులు చేస్తున్న ఈ తప్పులను, పారదర్శకత లేని విధానాలను ప్రశ్నించడానికి భారత రాజ్యాంగం సామాన్య పౌరుడికి అత్యంత శక్తివంతమైన హక్కులను కల్పించింది. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి ఒక్క జీవో (G.O), నిధుల ప్రణాళిక, ఎస్టిమేషన్ కాపీలను నిలదీసి అడిగే హక్కు పౌరులకు ఉంది. అలాగే 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక వనరులపై మొదటి హక్కు స్థానిక గ్రామ పంచాయతీకి, గ్రామసభకు మాత్రమే ఉంటుంది. అధికారుల ఇష్టారాజ్యానికి ఇక్కడ తావు లేదు.

**మా చెరువు మాకు కావాలి!**

దొంతికుంట చెరువు కేవలం ఒక నీటి వనరు కాదు, అది అశ్వారావుపేట ప్రజల జీవనాడులలో ఒకటి. అభివృద్ధి పేరుతో చెరువు ఉనికిని దెబ్బతీస్తూ, పారదర్శకత లేకుండా చేసే పనులను ప్రజలు సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. "మా చెరువు-మా హక్కు" అంటూ ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, పనులను నిలిపివేసి, పూర్తి స్థాయి విచారణ జరిపి, ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నాం!

ఇప్పుడైనా సంబంధిత అధికారులు పూర్తి విచారణ చేసి చెరువుని కాపాడాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## తెలుగు అకాడమీ నూతన సంచాలకులకు ఘన సన్మానం

**ఆచార్య భట్టు రమేష్‌కు ఎన్‌బీఎంఐ తెలంగాణ శుభాకాంక్షలు**



మేడ్చల్ మల్కాజ్గిరి ప్రభాత సూర్యుడుతెలుగు అకాడమీ నూతన సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య భట్టు రమేష్‌ను సోమవారం తెలుగు అకాడమీ సమావేశ మందిరంలో నేషనల్ బంజారా మిషన్ ఇండియా (ఎన్‌బీఎంఐ) తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీఎంఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ నాయక్, రాష్ట్ర లీగల్ అడ్వైజర్లు అడ్వొకేట్ రవి రాజ్ రాథోడ్, మురళి నాయక్, ఆర్. తులసిరామ్ తదితరులు పాల్గొని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ, తెలుగు భాష మన సంస్కృతి, చరిత్రకు మూలస్తంభమని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య పరిరక్షణ, యువతలో మాతృభాషపై అభిమానం పెంపొందించడంలో తెలుగు అకాడమీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆచార్య భట్టు రమేష్ నాయకత్వంలో అకాడమీ మరింత అభివృద్ధి సాధించి భాషా సేవలో కొత్త మైలురాళ్లు చేరుకోవాలని ఆకాంక్షించారు. అడ్వొకేట్ రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ, తెలుగు భాష పరిరక్షణకు ప్రభుత్వం, మేధావులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మురళి నాయక్, ఆర్. తులసిరామ్ తదితరులు పాల్గొని ఆచార్య భట్టు రమేష్‌కు అభినందనలు తెలియజేసి, వారి పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు..

## అమెరికాలో తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతున్న ప్రవాస తెలంగాణ సమాజం మంత్రి సీతక్క

ములుగు జూలై 20 ప్రభాత సూర్యుడుఅమెరికాలో నిర్వహించిన తెలుగు అమెరికా తెలంగాణ అసోసియేషన్ టి టి ఏ మెగా కన్వెన్షన్‌లో మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రవాస తెలంగాణవారిని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలంగాణ మూలాలను, తెలుగు భాషను, సంస్కృతిని గర్వంగా నిలబెట్టుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానిక వేర్లను మరువకుండా ప్రపంచ స్థాయి విజయాలను అందుకోవడమే నిజమైన ప్రగతి అని పేర్కొన్నారు.



అమెరికాలోని తెలంగాణ కుటుంబాలు ఐక్యంగా ఉండి భావితరాలకు తెలంగాణ చరిత్ర, సంప్రదాయాలను పరిచయం చేయాలని మంత్రి సూచించారు. ప్రవాస భారతీయులు అక్కడ నేర్చుకున్న సాంకేతికత, నిర్వహణ, పని సంస్కృతి, ఆవిష్కరణలను తెలంగాణ అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. ఒక విద్యార్థికి మార్గదర్శకత్వం, ఒక ప్రభుత్వ పాఠశాలకు చేయూత, ఒక మహిళా సంఘానికి మార్కెట్ అవకాశాలు, ఒక రైతుకు కొత్త సాంకేతికతను పరిచయం చేయడం వంటి సామాజిక బాధ్యతలను స్వీకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతూ మహిళలకు ఉపాధి, వ్యాపార అవకాశాలను విస్తృతంగా కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళల అభివృద్ధికి ప్రవాస తెలంగాణవారు కూడా భాగస్వాములు కావాలని, వారి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక ఆస్తుల సృష్టికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ అభివృద్ధి పథంలో కలిసి ముందుకు సాగాలని, ప్రపంచవ్యాప్తంగా తెలుగు కీర్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. ఆదివాసి సంప్రదాయం ప్రకారంగా వనదేవతలైన సమ్మక్క సారలమ్మ తల్లుల గద్దెల ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు చేశారు

## ప్రజావాణిలో 84 అర్జీలు స్వీకరణ

**వినతులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ మను చౌదరి**

మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ జూలై 20 ప్రభాత సూర్యుడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఐఏఎస్ అధ్యక్షతన జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మాలతితో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సమస్యలు, వినతిపత్రాలను కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణిలో మొత్తం 84 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, వాటిని త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి అర్జీపై సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి వినతికి ప్రాధాన్యత ఇచ్చి పారదర్శకంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.





## కాళేశ్వరం జలాలతో ఆరేళ్లుగా పంటలు పండుతుంటే కాంగ్రెస్‌కు కనిపించడం లేదా?: బీఆర్ఎస్ నేతల ప్రశ్న

ప్రభాత సూర్యుడు – చిన్నకోడూరు చిన్నకోడూరు మండల రైతుల ప్రయోజనాల కోసం నిర్వహించిన రైతుల



మహా పాదయాత్రకు వేలాది మంది రైతులు స్వచ్ఛందంగా హాజరయ్యారని, ఆ స్పందనను కాంగ్రెస్ నాయకులు విస్మరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కామని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్ మానేరు, అన్నపూర్ణ సాగర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాల నుంచి రైతులకు సాగునీరు అందించి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండే పరిస్థితిని బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.రైతు బంధు పథకం ద్వారా రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానిదేనని వారు తెలిపారు. ప్రస్తుతం సాగుకు అందుతున్న నీరు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే వస్తోందని పేర్కొంటూ, అలాంటి ప్రాజెక్టును విమర్శించడం సమంజసం కాదన్నారు.మాజీ మంత్రి హరీష్ రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించిన వారు, రైతుల మహా పాదయాత్రలో పాల్గొన్న రైతులను అవమానించేలా చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, సిద్ధిపేట--ఇల్లంతకుంట రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని, రంగనాయకసాగర్, అంతగిరి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నింపి రైతులకు సాగునీరు అందించాలని, విద్యుత్ కోతలను నివారించి ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు.గత రెండున్నర సంవత్సరాలుగా చిన్నకోడూరు మండలంలో కాలువల నిర్మాణం, భూసేకరణ వంటి కీలక అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించిన బీఆర్ఎస్ నాయకులు, రైతుల సమస్యలు పరిష్కరించేవరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొండం రవిందర్ రెడ్డి, కాముని ఉమేష్ చంద్ర, కాల్వ ఎల్లం, రేగుల దేవయ్య, నాగార్జున రెడ్డి, నముండ్ల హరీష్, ముసిమిరి సాయి, పంపరి కనకయ్య, బంక పోషయ్య, ఏదుల రాజిరెడ్డి, బంక రాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



## 87% వర్షపాతం :జిల్లా మెజిస్ట్రేట్

జులై 20 ప్రభాత సూర్యుడు సంగారెడ్డి జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈసారి వర్షపాతం 87% మేర తగ్గిందని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎల్ నినో పై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.వర్షభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా కార్యక్రమం ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు.



# క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే ఎల్‌నినోను ఎదుర్కోవాలి....

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.

## క్షేత్రస్థాయి పరిస్థితుల అధ్యయనానికే జిల్లా సమీక్షా సమావేశాలు.




ఖమ్మం, జూలై 20 ప్రభాత సూర్యుడుఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతోనే సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులు, వర్ష పాతం, త్రాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జూలై 15 నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రైతులు ప్రస్తుతం పత్తి అధికంగా సాగు చేశారని, వర్షాలు వస్తే వరి పంట వేద్దామని చూస్తున్నారని, భూగర్భ జలాలు గలవారు వరి పంట సాగుకు ముందుకు వెళు న్నారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ భూగర్భ జలాలు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాబోయే రెండు నెలల్లో మరింత తగ్గిపోతాయని, రైతులు ఎవరు వరి పంట సాగు చేయవద్దని ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే జిల్లాల్లో సమీక్షా సమావేశాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి పారుదల, ప్రణాళిక, వ్యవసాయ, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం లోటు ఎంత, దాని ప్రభావం ఏమిటనే అంశాలపై ప్రతి రైతుకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రభుత్వం వద్ద ఉన్న వాస్తవ సమాచారం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత ఏడాది, ఈ ఏడాది నీటి వనరుల లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై వివరాలతో ప్రణాళిక శాఖ సమగ్ర నివేదిక సిద్ధం చేసి మీడియాకు, క్షేత్రస్థాయి అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించిన మేరకు రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించుకోవచ్చో అన్ని సాంకేతిక అవకాశాలను పరిశీలించి తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వర్షపాతం పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి మాత్రమే రైతులు పంటల ఎంపిక చేసుకునేలా క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగునీరు వచ్చే పరిస్థితి లేదని, పాలేరు ఆయకట్టుకు కూడా సాగునీరు అందుబాటులో ఉండదని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. వాస్తవ పరిస్థితులను దాచకుండా అధికారులు నేరుగా రైతులతో మాట్లాడాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా త్రాగునీటి వనరులు సరిపోని పరిస్థితి ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ వనరులను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాబోయే ఒక సంవత్సరం త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యత ఆధారంగా మాత్రమే పంటల ప్రణాళిక రూపొందించాలని, వరి వంటి నీటి అధిక అవసరమున్న పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. పెసర, మినుములు, కందులు, అలసంద, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను మాత్రమే రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశము ఉన్నందున బోర్ల ఆధారంగా వరి సాగు చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలు, భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిందని, నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇటువంటి తీవ్రమైన కరువు పరిస్థితులు దాదాపు 150 సంవత్సరాలకు ఒకసారి సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి మండల స్థాయి అధికారి అత్యంత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశముందని, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉ న్నందున రానున్న రోజుల్లో విద్యుత్ సరఫరా పై కూడా ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బోర్లపై ఆధారపడి నీటి అధిక అవసరమున్న పంటలను సాగు చేయకుండా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అధికారులు మౌనంగా ఉండకుండా వాస్తవ పరిస్థితులను రైతులకు స్పష్టంగా తెలియ జేయాలని, సమాచార ప్రసారంలో సమర్థవంతమైన విధానాన్ని అవలంబించాలని సూచించారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఏమీ చేయలేదనే పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే అది పూర్తిగా రైతుల సొంత బాధ్యతేనని స్పష్టమైన సందేశం క్షేత్రస్థాయిలో చేరాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాధ్యమైనన్ని ప్రాంతాల్లో గోదావరి బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోసి చెరువులను నింపేందుకు అవసరమైన మోటార్లు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేసి ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం గోదావరి నీటిని వినియోగించి చెరువులను నింపగలిగితే వచ్చే వేసవి వరకు త్రాగునీటి అవసరాలను తీర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖరీఫ్‌లో సాగునీటికి నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం వైరా, లంకా సాగర్ జలాశయాలను త్రాగునీటి అవసరాల కోసమే నింపుతున్నా మని, పాలేరు జలాశయంలో కూడా సెప్టెంబర్-2026 వరకు మాత్రమే తాగునీటి నిల్వలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి నీటిని పాలేరు జలాశయానికి తరలించే అవకాశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను అవకాశంగా మలుచుకొని ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాబోయే మూడు నెలల పరిస్థితులకే పరిమితం కాకుండా కనీసం ఒక సంవత్సరం కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. లప్రతి మండలానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ, వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జలాల, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో స్థానిక సమాచారాన్ని విశ్లేషించి మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ప్రతి మండలంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి మండలానికి సంబంధించిన ధృవీకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు అందించాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, జిల్లా స్థాయిలో సమగ్ర కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి వర్షపాతం, త్రాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు జిల్లాలో పప్పు ధాన్యాలు, అలసంద, కందులు, పెసర వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు జరిగేలా గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటికి ఉన్న అవకాశాలపై స్పష్టమైన సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. సొంత బోర్లు ఉన్న రైతుల వివరాలను సేకరించి, ముఖ్యంగా సత్తుపల్లి ప్రాంతంలో అధికంగా వరి సాగు జరుగుతున్నందున అక్కడ ప్రత్యేక దృష్టి సారించి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో వరి సాగును నిరుత్సాహ పరుస్తూ కూరగాయల సాగును కూడా ప్రోత్సహిస్తున్నామని, అవసరమైన విత్తనాలను ఇప్పటికే సిద్ధంగా ఉంచామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పూర్తి సమాచారం అధికారులకు అందుబాటులో ఉండాలని, ప్రస్తుతం జరుగుతున్న అన్ని ఎత్తిపోతల ద్వారా నీటి సరఫరా త్రాగునీటి అవసరాల కోసమేనని, సాగునీటి కోసం కాదనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియ జేయాలని సూచించారు. ఆగస్టు 1వ తేదీ నుండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది అదనంగా 8 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు వచ్చారని, మరో 5 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల విస్తరణ లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్న పరిస్థితిని క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిగా వివరించి, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం డిప్యూటీ సీఎం, మంత్రివర్యులు, జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ తెలంగాణ జలసిరి, ఎల్ నినో సూపర్ స్థితిలో తీసుకునే చర్యలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా,పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరం.

### వనవాసీ కమిటీ సభ్యులు కిషోర్.

ప్రభాత సూర్యుడు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండి20 విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరమని వనవాసీ కళ్యాణ కొమరం భీం నిలయ కమిటీ సభ్యులు శివరాజు కిషోర్ అన్నారు. చర్లలోని రైస్ పేట గ్రామానికి చెందిన చీమకుర్తి రామకృష్ణ ప్రసాద్ (కిట్టప్పు) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్స్, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా నిలయ ప్రముఖ్ సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిషోర్ విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడాను. విద్యార్థి నిలయంకు దాతలు అందచేస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. పేద విద్యార్థుల చదువులకు



సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళికృష్ణ మాట్లాడుతూ సంస్కారంతో కూడిన విద్య ఎంతో అవసరమని అన్నారు. దాతల మనోభావాలను అనుగుణంగా విద్యార్థులు చదివి సంస్థ పేరుప్రతిష్టతను నిలపాలన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ దాతలను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఇదే క్రమ శిక్షణను కొనసాగించి జీవితంలో ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిలయ కమిటీ సభ్యులు, విద్యార్థులు స్వర్గీయ రామకృష్ణ ప్రసాద్ కు పూలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వనవాసీ జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజావాణి కి రాళ్లాపురం గిరిజన సమస్యలు.

ప్రభాత సూర్యుడు. బాహ్య ప్రపంచానికి దూరంగా బతుకుతున్న గిరిజనులు తమ గోడును యువ న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్ సారథ్యంలో ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ కి విన్నవించుకున్నారు. ఎన్నో ఏళ్లుగా చర్ల మండలంలోని



రాళ్ళపురం గ్రామానికి సరైన రహదారి లేక విద్యా వైద్యం సకాలంలో అందడం లేదు. సరైన రహదారి లేకపోవడం వల్ల వర్షాకాలంలో ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినట్లయితే జట్టి గట్టి అడవి మార్గం గుండా సుమారు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రహదారికి తీసుకొని పోవాల్సి వస్తుంది. వర్షాకాలంలో గర్భిణీ స్త్రీల బాధలు అంతా ఇంతా కాదు. ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకు జీవుడా అంటూ కాలం వెళ్ళదిస్తున్నం అని గిరిజనులు తాము అనుభవిస్తున్న ఇబ్బందులను జాయింట్ కలెక్టర్ కు విన్నవించుకున్నారు. గిరిజనుల గోడు విని స్పందించిన జాయింట్ కలెక్టర్ గ్రామానికి కావాల్సిన విద్య వైద్యం రవాణా సౌకర్యం గురించి సంబంధిత అధికారులతో సంప్రదించి త్వరితగతిన తగు న్యాయం జరిగేటట్టుగా చూస్తానని జాయింట్ కలెక్టర్ గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్కీ ప్రవీణ్ ముస్కిరాజయ్య మడకం చిరంజీవి ముస్కి బాలరాజు మడకం ఇడమయ్య మడివి చుక్కయ్య సోడి సంతోష్ ముసయ్య ఉంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళిత--గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

### ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలి.



సింగరేణి జులై 20 ప్రభాత సూర్యడ్ లంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండలంలోని దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమస్యలపై నిర్వహించిన సర్వేలో పలు కీలక సమస్యలు వెలుగులోకి వచ్చాయని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, గృహాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, భూమిలేని వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ చట్టం సవరణతో, జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారుదళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను ఎలాంటి ఆలస్యం లేకుండా విడుదల చేసి, ఆ నిధులను దళిత, గిరిజన ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధుల చట్టం అమలులో ఉందని, దాని లక్ష్యం ఈ వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం జిల్లా లో ఐటీడీఏ ను ఏర్పాటు చేయాలి అన్నారు. అంతోదయ అన్నపూర్ణ కార్డు లబ్ధిదారులుగా పేద దళిత గిరిజనులు అత్యధిక మంది ఉన్నారని 35 కిలోల బియ్యం అందించే ఈ కార్డులు రద్దు చేయడం వల్ల వర్గాలకు తీవ్ర నష్టం జరుగుతుందని కేంద్రం అంతోదయ కార్డుల రద్దు ప్రయత్నం విరమించుకోవాలన్నారురాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మొదటి విడత లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు చివరి బిల్లులు నేటికీ విడుదల కాలేదా కేంద్రం ఇవ్వవలసిన ఎన్ఆర్ఈజీ ఎస్ కింద ఇచ్చే రూ 60 వేలు వెంటనే విడుదల విడుదల చేయాలని దళిత గిరిజనులకు 6 లక్షల రూపాయల బిల్లులు చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని రెండో విడతలో అర్హులైన వారందరికీ రాజకీయ పక్షపాతా లేకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారువిద్య వైద్యం ఇల్లు ఇళ్ల స్థలాలు పోడుహక్కుల ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు ఆయన డిమాండ్ చేశారు తీసుకోవాలని, నిరుపేద దళిత, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.

## మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ డి.ఎస్.ఓ



జులై 20 ప్రభాత సూర్యుడు ఎల్ నినో తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ నెలల రేషన్ సన్నబియాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని భారత కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది! జిల్లాలో ఇందుకు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్ఓ నిత్యానంద్ సోమవారం తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని 520 రేషన్ దుకాణాల ద్వారా 2,41,832 తెల్ల రేషన్ కార్డు దుకాణదారులకు మూడు విడతల్లో బియ్యం పంపిణీ చేయనున్నారు అని ఆయన తెలిపారు

# హాలీవుడ్ లో ప్రియాంక చోప్రా జోరు తగ్గిందే!


ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారతీయ తార ప్రియాంక చోప్రా జోనాస్ హాలీవుడ్‌లో ప్రయాణాన్ని కొనసాగిస్తున్నా? రెండేళ్లగా అక్కడా సినిమాల సంఖ్య తగ్గడం చర్చనీయాంశమైంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారతీయ తార ప్రియాంక చోప్రా జోనాస్ హాలీవుడ్‌లో ప్రయాణాన్ని కొనసాగిస్తున్నా? రెండేళ్లగా అక్కడా సినిమాల సంఖ్య తగ్గడం చర్చనీయాంశమైంది. ఈ రెండేళ్ల కాలంలో అమ్మడు పరిమిత ప్రాజెక్టులకు మాత్రమే పరిమితమయ్యారు. గత ఏడాది రిలీజ్ అయిన -హెడ్స్ ఆఫ్ స్టేట్-, ఇటీవల విడుదలైన -ద బ్లఫ్- వంటి సినిమాల్లోనే కనిపించారు. అంతకు ముందు ఏడాది మూడు సినిమాలు చేసిన నటి? ఒక్కసారిగా అక్కడా సైలెంట్ అవ్వడం అభిమానుల్ని నిరుత్సాహ పరుస్తోంది. మరి అందుకు కారణాలు ఏంటి? అంటే? రకరకాలు రీజన్స్ తెరపైకి వస్తున్నాయి. పీసీ వ్యక్తిగత జీవితంలో వచ్చిన మార్పులేనని కొందరంటున్నారు. వివాహం .. మాతృత్వం ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయాయని ప్రియాంక స్వయంగా వెల్లడించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో పీసీ మాట్లాడుతూ, -నేను ఇప్పుడు పాతలాగా ఏడాదికి ఐదు సినిమాలు చేయలేను. నా జీవితంలో సమతుల్యత ముఖ్యం- అని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లడంలో సమర్థవంతమైన ప్రణాళికను అనుసరిస్తున్నారు. హాలీవుడ్‌లో తనకు లభిస్తున్న పాత్రల వైవిధ్యంపై కూడా అసంతృప్తిగా ఉన్నారు. బాలీవుడ్‌లో వచ్చినన్ని అవకాశాలు హాలీవుడ్‌లో ఇంకా దక్కలేదని ఓ సందర్భంలో బహిరంగంగానే అభిప్రాయపడ్డారు. కేవలం నటించడమే కాకుండా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉన్న పాత్రల కోసం కూడా అంతే ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే సొంత ప్రొడక్షన్ సంస్థ ద్వారా కథలను ఎంచుకోవడం.. నిర్మించడంపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. పనితీరు విషయంలో ఆందోళన అవసరం లేదని అమ్మడి కెరీర్ గ్రాఫ్ చెబుతోంది. -ద బ్లఫ్- చిత్రంలోని నటనకు గానూ పీసీ ఇప్పటికే ఉత్తమ నటిగా క్రిటిక్స్ ఛాయిస్ సూపర్ అవార్డ్స్‌కు నామినేషన్ పొందడం విశేషం. ఇది పీసీలోని అభినేత్రికి అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఆదరణను సూచిస్తోంది. పరిమాణం కంటే నాణ్యతకే పీసీ ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తున్నారని అర్థమవుతోంది.



# జాతీయ అవార్డును మించి యామీకి ఆర్జీవీ నుంచి ప్రశంస!

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) ఒక కథానాయికను పొగిడేయడం అనేది చాలా అరుదు. హీరోయిన్ లతో సరదా పరాచికాలకు ఎప్పుడూ సిద్ధంగా ఉండే ఆర్జీవీ ఈసారి మాత్రం భిన్నంగా కనిపించారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నటి యామీ గౌతమ్‌ను అభినందిస్తూ సోషల్ మీడియాలో ఆకాశానికెత్తేసారు. ఇంతకుముందు దురంధర్ దర్శకుడు యామి గౌతమ్ భర్త ఆదిత్యాధర్‌ని ఆకాశానికెత్తేసిన ఆర్జీవీ ఇప్పుడు అతడి భార్య యామీగౌతమ్ పై ప్రశంసలు కురిపించడం ఆసక్తికరం. యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో నటించిన -ఆర్టికల్ 370- చిత్రానికి గాను యామి జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె --ప్రతి ప్రయాణంలోనూ మనం ఎందుకు వెనకడుగు వేయకూడదో గుర్తుచేసే ఒక క్షణం వస్తుంది.. ఈ రోజు నాకు అలాంటి క్షణమే-- అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దీనిపై రామ్ గోపాల్ వర్మ స్పందిస్తూ.. తనకు వ్యక్తిగతంగా అవార్డుల సంస్కృతిపై ఎప్పుడూ నమ్మకం లేదని.. కానీ ఒక వ్యక్తి తన వృత్తిపై చూపే అంకితభావానికి, నిబద్ధతకు లభించే గుర్తింపును తాను నమ్ముతానని పేర్కొన్నారు. కేవలం ఒక ప్రాజెక్ట్‌గా కాకుండా... తను బలంగా నమ్మిన ఒక కథను అంతే చిత్తశుద్ధితో యామీ గౌతమ్ తెరపైకి తీసుకురావడం వల్లే ఈ గౌరవం దక్కిందని ఆయన ప్రశంసించారు. ఈ జాతీయ అవార్డు ఆమెకు ఒక గొప్ప గౌరవంగా అనిపించవచ్చు కానీ... తనకు మాత్రం ఆమె ఇక్కడి వరకు చేరుకోవడానికి పడ్డ కష్టం, పట్టుదల, తీసుకున్న రిస్క్‌లు .. ఎక్కడా లొంగిపోని నైజమే తనను ఎక్కువగా ఆకట్టుకున్నాయని ఆర్జీవీ అన్నారు. ఇటుక ఇటుక పేర్చి ఒక అందమైన భవనాన్ని నిర్మించినట్లుగా యామీ తన కెరీర్‌ను నిర్మించుకుంటూ ఈ స్థాయికి చేరిందని... భవిష్యత్తులో తన నుండి ఇలాంటివి మరెన్నో వస్తాయని ఆశిస్తూ అభినందనలు తెలిపారు. జాతీయ అవార్డుల విజేతలపై సోషల్ మీడియాలో నెటిజన్ల భిన్నాభిప్రాయాలు..





ఇటీవల ప్రకటించిన ప్రతిష్టాత్మక సినీ అవార్డులలో అద్భుత ప్రదర్శన కనబరిచిన నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, మరియు కార్తీక్ ఆర్యన్ ఉత్తమ నటనకు గానూ పురస్కారాలు అందుకోవడం సోషల్ మీడియా వేదికగా పెద్ద చర్చకు దారితీసింది. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టిని --ఇండియన్ సినిమా ఫేస్-- అని కొనియాడుతూ.. ఆయనకు ఇది నాలుగో నేషనల్ అవార్డు అంటూ దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే -ఆర్టికల్ 370- చిత్రంలో పవర్ ఫుల్ నటనకు గానూ యామీ గౌతమ్ ఈ అవార్డుకు వంద శాతం అర్హురాలని నెటిజన్లు ఏకగ్రీవంగా మద్దతు పలికారు. ఇక -చందు ఛాంపియన్- కోసం తీవ్రంగా శ్రమించిన కార్తీక్ కి గుర్తింపు దక్కినా అవార్డు రావడంపై కొన్ని విమర్శలున్నాయి. ఈ అవార్డుల ఎంపికపై కామెంట్ల సెక్షన్‌లో నెటిజన్ల మధ్య తీవ్రమైన భిన్నాభిప్రాయాల నడుమ వివాదాలు రేగాయి. ముఖ్యంగా మమ్ముట్టి లాంటి లెజెండరీ నటుడితో సమానంగా కార్తీక్ ఆర్యన్‌కు
అవార్డును షేర్ చేయడంపై కొందరు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ... -శ్రీకాంత్- చిత్రంలో నటించిన రాజ్‌కుమార్ రావు వంటి వారు దీనికి ఎక్కువ అర్హులని అభిప్రాయపడ్డారు. దీంతో పాటు సౌత్ నుంచి కంటెంట్ ఓరియెంటెడ్‌గా వచ్చిన -మహారాజ-, -మెయ్యళగన్-, -కిష్కింధ కాండం- వంటి చిత్రాలను కాదని... కేవలం బాలీవుడ్ కమర్షియల్ చిత్రాలకే పెద్దపీట వేశారనే అసంతృప్తి కూడా వ్యక్తమైంది. దీనికి తోడు దేశంలో విద్యార్థుల హక్కులు, సామాజిక సమస్యలపై నోరు విప్పని సెలబ్రిటీలకు ఈ పురస్కారాలు ఎందుకంటూ కొందరు ఆగ్రహం వ్యక్తం చేయగా.. మరికొందరు ఎప్పటిలాగే ఫన్నీ పజిల్స్, స్పామ్ కామెంట్లతో సోషల్ మీడియా వేదికగా రచ్చ చేశారు.

# 'టాక్సిక్' నుంచి కొత్త అప్ డేట్.. యశ్ సరసన తారా సుతారియా ?




గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో 'కేజీఎఫ్' స్టార్ యశ్ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. ఐతే, ఈ చిత్ర నిర్మాతలు ఈ సినిమా రెండో పాటను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా, మరియు అర్సాన్ నిజామీ స్వరపరిచిన ఈ పాటను సిద్ధార్థ్ బస్రూర్ పాడారు. ఈ కొత్త పాటలో యష్ సరసన తారా సుతారియా నటించిందని టాక్.కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌లో యశ్ సహ-నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నాడు. ఇక ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, నయనతార, హుమా ఖురేషి, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, బాలాజీ మనోహర్, అమిత్ తివారీ, సురజిత్ గోపినాథ్‌తో పాటు అంతర్జాతీయ నటులు డారెల్ డి'సిల్వా, కైల్ పాల్, మరియు బీట్రిజ్ టౌఫెన్‌బాచ్ నటిస్తున్నారు.రవి బస్రూర్ సహా పలువురు ప్రతిభావంతులైన సంగీత బృందం ఈ చిత్రానికి సంగీతం అందిస్తోంది. భారీ అంచనాలు ఉన్న 'టాక్సిక్' చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# మోహన్ బాబు పాత్ర పై క్రేజీ న్యూస్ !



దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వంలో లెజెండరీ సూపర్ స్టార్ కృష్ణ మనవడు, ఘట్టమనేని రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా రాబోతున్న సినిమా 'శ్రీనివాస మంగాపురం'. ఇది ఒక ఎమోషనల్ లవ్ స్టోరీ అని, తిరుపతి నేపథ్యంలో రస్టిక్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఈ కథలో మోహన్ బాబు పాత్ర చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుందట. శక్తివంతమైన ప్రతినాయక పాత్రలో మోహన్ బాబు కనిపిస్తారని, ముఖ్యంగా హీరోకి -- మోహన్ బాబుకి మధ్య వచ్చే సీన్స్ లో సంఘర్షణ చాలా ఇంటెన్సివ్ గా ఉంటుందని తెలుస్తోంది. పైగా ఈ సినిమా మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. మొత్తానికి సినిమాలో ఎమోషనల్ డ్రామా కూడా చాలా బాగుంటుందని తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమాలో సీనియర్ కథానాయిక రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్ గా నటిస్తోందని తెలుస్తోంది. ఆమె కూడా ఈ సినిమాతోనే తెలుగులోకి అరంగేట్రం చేయబోతుంది. చందమామ కథలు పిక్చర్స్ పతాకంపై జెమిని కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు,

# విజయ్ దేవరకొండకు అసలైన టర్నింగ్ పాయింట్ ఇదేనా?



టాలీవుడ్‌లో ఒకప్పుడు మంచి సక్సెస్‌లతో యూత్ లో స్పెషల్ క్రేజ్ ను సంపాదించుకున్న విజయ్ దేవరకొండ గత కొంతకాలంగా ఆశించిన స్థాయి బాక్సాఫీస్ సక్సెస్ ను అందుకోలేకపోయాడు.టాలీవుడ్‌లో ఒకప్పుడు మంచి సక్సెస్‌లతో యూత్ లో స్పెషల్ క్రేజ్ ను సంపాదించుకున్న విజయ్ దేవరకొండ గత కొంతకాలంగా ఆశించిన స్థాయి బాక్సాఫీస్ సక్సెస్ ను అందుకోలేకపోయాడు. స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గకపోయినా, ఆయన ఫ్యాన్స్ మాత్రం మరోసారి భారీ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రూపొందుతున్న రౌడీ జనార్దన్ సినిమాపై ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఈ సినిమా విజయ్ కెరీర్‌కు కంబ్యాక్‌గా నిలుస్తుందా అనే ప్రశ్న ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లోనూ వినిపిస్తోంది. సినీ పరిశ్రమలో స్టార్ హీరోల కెరీర్‌ను ఒక్క సినిమా పూర్తిగా మార్చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. సరైన కథ, స్ట్రాంగ్ ప్రెజెంటేషన్, ప్రేక్షకుల అభిరుచికి తగ్గ కమర్షియల్ అంశాలు కలిస్తే రిజల్ట్ ఎలా ఉ ంటుందో ఇప్పటికే పలువురు హీరోలు నిరూపించారు. ఇప్పుడు విజయ్ కూడా అలాంటి టర్న్ కోసమే ఎదురుచూస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రౌడీ జనార్దన్ తర్వాత విజయ్ దేవరకొండ లైనప్ కూడా ఆసక్తికరంగానే కనిపిస్తోంది. విభిన్న డైరెక్టర్లతో డిస్కషన్స్ జరుపుతున్నట్టు ప్రచారం సాగుతుండగా, ఒకే తరహా కథలకే పరిమితం కాకుండా కొత్త జానర్లను కూడా పరిశీలిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. కెరీర్‌ను దీర్ఘకాలికంగా ప్లాన్ చేసుకునే దిశగా స్క్రిప్ట్ ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. మరోవైపు పాన్ ఇండియా మార్కెట్‌పై కూడా విజయ్ ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. అర్జున్ రెడ్డితో తన మార్కెట్ ను బాగా పెంచుకున్న విజయ్, ఇప్పుడు అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకునే కథలకే ప్రాధాన్యం ఇస్తున్నారని సమాచారం. సౌత్ మార్కెట్ తో పాటు హిందీ బెల్ట్‌లో కూడా తన మార్కెట్‌ను బలోపేతం చేయాలనే స్ట్రాటజీతో ముందుకు సాగుతున్నట్లు ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ కూడా గతంతో పోలిస్తే మరింత పెరిగింది. ప్రతి స్టార్ హీరో భారీ స్థాయి ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న పరిస్థితుల్లో విజయ్ దేవరకొండకు కూడా ఒక స్ట్రాంగ్ సక్సెస్ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాంటి టైమ్ లో రౌడీ జనార్దన్ రిజల్ట్ ఆయన తదుపరి ప్రాజెక్టుల మార్కెట్‌పై కూడా ప్రభావం చూపే అవకాశముందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే కేవలం ఓపెనింగ్స్ మాత్రమే కాకుండా, కంటెంట్ పరంగా కూడా ఆడియన్స్ ను మెప్పించగలిగితేనే విజయ్ దేవరకొండ కెరీర్‌లో కొత్త చాప్టర్ మొదలవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఈ సినిమాను ఫ్యాన్స్ మాత్రమే కాదు, ఇండస్ట్రీ కూడా ప్రత్యేకంగా గమనిస్తోంది. మరి ఇలాంటి పరిస్థితుల్లోరౌడీ జనార్దన్ విజయ్‌కు మరో సాధారణ సినిమా అవుతుందా, లేక కెరీర్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లే అసలైన కమ్‌బ్యాక్‌గా నిలుస్తుందా అన్నది రిలీజ్ తర్వాతే క్లారిటీ రానుంది.

# యువ హీరో ప్రిన్స్ వివాహ బంధంలోకి.. పెళ్లి తర్వాత కెరీర్ టర్న్ అవుతుందా?

టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ఎలాంటి ఫిల్మీ బ్యాక్‌గ్రౌండ్ (సినీ నేపథ్యం) లేకుండా సొంత ప్రతిభతో అడుగుపెట్టిన అతికొద్ది మంది యువ హీరోలలో ప్రిన్స్ సిసిల్ ఒకరు. టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ఎలాంటి ఫిల్మీ బ్యాక్‌గ్రౌండ్ (సినీ నేపథ్యం) లేకుండా సొంత ప్రతిభతో అడుగుపెట్టిన అతికొద్ది మంది యువ హీరోలలో ప్రిన్స్ సిసిల్ ఒకరు. ప్రముఖ దర్శకుడు తేజ ఆవిష్కరణగా (తేజ డిస్కవరీ) ఇండస్ట్రీకి పరిచయమైన ప్రిన్స్.. -నీకు నాకు డ్యాష్ డ్యాష్-, -బస్ స్టాప్- వంటి చిత్రాలతో కుర్రకారులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై సైతం తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఇటీవల వరుస సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ మల్టీ టాలెంటెడ్ నటుడిగా బిజీగా గడుపుతున్నారు. ఇలా కెరీర్ పరంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్న ఈ యువ హీరో ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో ఓ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. త్వరలోనే అతడు ఓ ఇంటివాడు కాబోతున్నారు. న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ఒక ఎన్నారై (చీ=×) అమ్మాయి సాయి మాచిరాజుతో ప్రిన్స్ వివాహం నిశ్చయమైంది. ఈ ఏడాది ఆగస్టు 24వ తేదీన వీరి వివాహ వేడుక న్యూజిలాండ్ లోనే అత్యంత వైభవంగా జరగనుందని సమాచారం. తన కాబోయే భార్యకు ప్రపోజ్ చేసిన ఓ అందమైన వీడియోని ప్రిన్స్ స్వయంగా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో పెళ్లి అధికారికం అయింది. ఈ వార్త తెలియడంతో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులతో పాటు అభిమానులు కూడా ఈ యంగ్ హీరోకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో సెంటిమెంట్లకు కొదవలేదు. ఇటీవల నటుడు అఖిల్‌కు పెళ్లి జరిగిన తర్వాత కెరీర్ పరంగా బాగా కలిసివచ్చింది. జైనబ్ ఆయన జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాతే -లెనిన్- రూపంలో అఖిల్ ఒక సాలిడ్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇదే సెంటిమెంట్ ప్రకారం.. ఇప్పుడు పెళ్లి తర్వాత ప్రిన్స్‌కు కూడా అదృష్టం కలిసివచ్చి,, కెరీర్ పరంగా పెద్ద సక్సెస్ లభిస్తే అది అతడికి అదనపు బోనస్ లాంటిదేనని సినీ విశ్లేషకులు, అభిమానులు ఆశిస్తున్నారు. ఎలాంటి సినీ నేపథ్యం లేదా గాడ్ ఫాదర్ లేకపోయినా ఇండస్ట్రీలో ఇప్పటివరకు ప్రిన్స్ సొంత బలంతోనే బాగానే ఈదగలిగారు. ప్రిన్స్ ప్రస్తుతం గల్లీ అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్న సంగతి తెలిసిందే. సెంటిమెంట్ ప్రకారం...! వివాహ బంధం ఇచ్చే సరికొత్త బాధ్యతలను నెరవేరుస్తూనే ప్రిన్స్ తన కెరీర్‌ను మరింత పునరుత్తేజంతో.. కొత్త ఉత్సాహంతో కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేని హీరోలు పరిశ్రమలో సుదీర్ఘకాలం నిలబడాలంటే కేవలం ఒకే రకమైన చాక్లెట్ బాయ్ పాత్రలకే పరిమితం కాకూడదు.




Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555